ప్రజారోగ్యం... అప్రమత్తం

- గ్రామాల్లో ముమ్మరంగా ఫీవర్ సర్వే
- వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు



సింగరాజుపాలెంలో ఫీవర్ సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

నల్లజర్ల: ఆరోగ్యమే మహాభాగ్యం అంటుంటారు పెద్దలు. అలాంటి వైద్య రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది.. ప్రజల ఆరోగ్యానికి భరోసా అందిస్తోంది. ఇందులో భాగంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం అల్పపీడనం, నైరుతి రుతుపవనాల ప్రభావంతో వానలు విస్తారంగా కురుస్తున్నాయి. ఈ సీజన్‌లో వ్యాధులకు ఆస్కారం ఉంది. దీంతో గ్రామాల్లో ఫీవర్ సర్వేను ప్రారంభించారు. నల్లజర్ల మండలంలో 24 గ్రామాలు ఉన్నాయి. పోతవరం, నల్లజర్లలో పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటి పరిధిలోని సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వే చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం నుంచి ఈ సర్వేను ప్రారంభించారు. జ్వర పీడితులు ఉంటే మందులు ఇస్తున్నారు. వానలతో లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరుతోంది. ఇందులో దోమలు, బ్యాక్టీరియా వృద్ధి చెంది పలు రకాల విష జ్వరాలు వ్యాప్తి చెందే పరిస్థితి ఉండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రజారోగ్యమే లక్ష్యంగా వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ చర్యలు ప్రారంభమయ్యాయి. ఓ వైపు వ్యక్తిగత, పరిసర పరిశుభ్రతపై అవగాహన కల్గిస్తూనే మరో వైపు ఇంటింటా ఫీవర్ సర్వేకు శ్రీకారం చుట్టారు. ఫీవర్ సర్వే యాప్‌లో వివరాలు పొందుపరుస్తున్నారు. ఆశ, ఏఎన్ఎం, వలంటీర్ల సహాయంతో బృందాలు గ్రామాల్లో జ్వరపీడితులను గుర్తిస్తున్నట్టు నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి తెల్లం గంగాధరరావు తెలిపారు. అక్కడక్కడా సాధారణ జ్వరాల కేసులు నమోదవుతున్నట్టు చెప్పారు. వర్షాకాలంలో సోకే వ్యాధులు, వాటి లక్షణాలు, జాగ్రత్తలను క్షేత్రస్థాయిలో ప్రజలకు ఈ బృందాలు వివరిస్తున్నాయన్నారు.

వానలతో ఇక్కట్లు

తాళ్లపూడి: మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి విడవకుండా వర్షం కురిసింది. పలు ప్రాంతాలు ముంపులో చిక్కుకున్నాయి. వర్షంతో జనజీవనం స్తంభించింది. ప్రజలు ఇంటికే పరిమితం అయ్యారు. తాళ్లపూడి సంత మార్కెట్ వద్ద, ప్రక్కిలంక రోడ్డుపై, వేగేశ్వరపురం రోడ్డు మలుపు, పంచాయతీ సమీపం, బల్లిపాడు వద్ద రోడ్డుపై నీరు నిలిచిపోయింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



తాళ్లపూడి మార్కెట్ సెంటర్‌లో నిలిచిన వర్షం నీరు

చాగల్లు: మండలంలో చాగల్లు, కలవలపల్లి, బ్రాహ్మణగూడెం, దారవరం, ఊనగట్ల, చిక్కాల తదితర ప్రాంతాల్లో గురువారం వర్షం పడింది. దారవరం, మార్కొండపాడు, నందిగంపాడు పల్లపు ప్రాంతాల్లోని వరి చేలలల్లో వర్షపు నీరు చేరింది. నిడదవోలు- పంగిడి రహదారిలో అక్కడక్కడా నీరు నిలిచిపోయింది.

ఫ్యామిలీ డాక్టర్‌తో చేరువైన వైద్యం



నందమూరులో వైద్య పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి ధర్మరాజు

కొవ్వూరు: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలకు వైద్యం చేరువైందని దొమ్మేరు పీహెచ్‌సీ వైద్యాధికారి సూరవరపు ధర్మరాజు తెలిపారు. నందమూరు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేశారు. కౌమర దశలో ఉన్న యువతుల్లో రక్తహీనత ఉంటే పోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలకు వెళ్లి చిన్నారులను పరీక్షించారు. ప్రస్తుతం వర్షకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. 105 మంది సాధారణ రోగులు, 13 మంది గర్భిణులు, ఇద్దరు బాలింతలు, 95 మంది మధుమేహ బాధితులు, 94 మంది రక్తపోటుతో బాధపడుతున్న వారికి సేవలు అందించామని వైద్యాధికారి ధర్మరాజు తెలిపారు.

విత్తన శుద్ధిపై అవగాహన అవసరం



రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

గోపాలపురం: విత్తన శుద్ధిపై రైతులు అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి బి.రాజారావు సూచించారు. గోపాలపురం మండలం భీమోలు గ్రామంలో గురువారం రైతులకు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. సాగు పెట్టుబడి తగ్గించి, నికర ఆదాయం సాధించడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో రైతులు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ఆరోగ్యవంతమైన నారు పెంచడం, పొలం పరిసరాలు ప్రతి రోజూ గమనించడం, మిత్ర పురుగులను సంరక్షించుకోవడం చేయాలన్నారు. వీఏఏలు కె.సిసిలీ, మణికంఠ, ఝాన్సీ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

పోస్టల్ బీమాను వినియోగించుకోవాలి



బీమా నమూనా చెక్కు అందజేస్తున్న పోస్టల్ ఎస్పీ కోమల్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: భారతీయ తపాలా శాఖ ఇండియా పోస్ట్ చెల్లింపుల బ్యాంకు (ఐపీపీబీ) ద్వారా గ్రూప్ యాక్సిడెంటల్ పాలసీని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఎస్పీ కోమల్ కుమార్ తెలిపారు. స్థానిక హెడ్ పోస్టాఫీసులో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తపాలాశాఖ ఏడాదికి రూ.399 ప్రీమియంతో రూ. పది లక్షల బీమా పాలసీని ప్రజలకు అందజేస్తోందన్నారు. పాలసీ తీసుకున్న ఫ్లెక్సీ యూనియన్‌కి సంబంధించిన ఒక వ్యక్తి మరణించడంతో ఆయన నామినీకి రూ.పది లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో ఐపీపీబీ సర్కిల్ హెడ్ ప్రకాష్, రీజినల్ హెడ్ గంగాధర్, బ్రాంచ్ హెడ్ సీహెచ్ వంశీకృష్ణ, అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీధరం, హెడ్ పోస్టుమాస్టర్ ఎంవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్యానికి ప్రాధాన్యం

రాజమహేంద్రవరం సిటీ: వర్షానికి రోడ్లపై పేరుకుపోయిన బురదను తొలగించేందుకు చర్యలు చేపట్టినట్లు నగరపాలకసంస్థ శానిటరీ సూపర్ వైజర్ ఐ.శ్రీనివాస్ తెలిపారు. గురువారం కురిసిన వర్షానికి నగరంలోని పలు ప్రాంతాల్లో బురద పేరుకు పోయిందన్నారు. హైటెక్ బస్టాండ్ వద్ద ప్రత్యేక వాహనం ద్వారా పేరుకుపోయిన బురదను తొలగించే చర్యలు చేపట్టామన్నారు.

జగనన్న సురక్షతో అర్హులకు న్యాయం



దేవరపల్లిలో లబ్ధిదారులకు వివిధ ధ్రువపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



కాకరపర్రులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పేదలకు న్యాయం చేయడానికే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దేవరపల్లి సచివాలయం వద్ద గురువారం సర్పంచ్ కడిమి వీరకుమారి అధ్యక్షతన జగనన్న సురక్ష సభ జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వెంకట్రావు హాజరై మాట్లాడారు. సురక్ష కార్యక్రమం ద్వారా వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, గృహ సారథులు ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలను తెలుసుకుని అధికారుల ద్వారా పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఈ నెలాఖరు వరకు 11 రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అధికారులు అందజేస్తారన్నారు. దేవరపల్లిలోని రెండు గ్రామ సచివాలయాల పరిధిలో 2 వేల వివిధ రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు ఇచ్చారన్నారు. 35 ఎకరాల భూమిని సేకరించి సుమారు 1,500 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చినట్టు చెప్పారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు, మండల ప్రత్యేక అధికారి జి.రాధాకృష్ణ, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, ఎంపీడీఓ డీవీఆర్ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: అర్హులందరికీ పథకాలు అందించాలనే లక్ష్యంతోనే జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. అనంతపల్లి సచివాలయం-1లో జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ వెంగల కమలకుమారి అధ్యక్షతన జరిగింది. 1,247 మందికి ఎమ్మెల్యే ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎంపీపీ బంక జయలక్ష్మి, ఉప సర్పంచ్ కలం సత్యనారాయణ, ఎంపీటీసీ యడ్లపల్లి మార్త, యజ్ఞవరపు లక్ష్మి, సొసైటీ అధ్యక్షులు కారుమంచి రమేష్, బంక అప్పారావు, మండలకన్వీనర్ గగ్గర శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు జాజుల దుర్గారావు పాల్గొన్నారు.

గోపాలపురం: స్థానిక సచివాలయం-1 వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేను దివ్యాంగ భార్యాభర్తలు కలసి ఇంటి స్థలం అందించాలని వేడుకున్నారు. వెంటనే ఆయన హౌసింగ్ అధికారులను పిలిచి ఇల్లు కేటాయించాలంటూ ఆదేశాలు జారీ ఇచ్చారు. ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ కాకులపాటి లలిత, మండల పార్టీ మాజీ కన్వీనర్ ఎస్‌కే వల్లీ, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర క్రీడల శాప్ డైరెక్టర్ కప్పల వరలక్ష్మి, ఎంపీడీఓ శ్రీదేవి, సర్పంచ్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: రామన్నగూడెంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లబ్ధిదారులకు పలు ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులను అందజేశారు. జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, ఎంపీటీసీ జిత్తుక విజయలక్ష్మి, సొసైటీ చైర్‌పర్సన్ చెరుకూరి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: కంసాలిపాలెం, డి.ముప్పవరం గ్రామాల్లో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ కొయ్యే సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగని పొలయ్య అందజేశారు. సర్పంచ్‌లు కొండపల్లి శ్రీనివాస్, నాగిరెడ్డి సత్తిపండు పాల్గొన్నారు.

చాగల్లు: చిక్కాల, చిక్కాల పాలెం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలను సర్పంచ్ కొయ్యే మణి అధ్యక్షతన నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు సుంకర రాయుడు, ఎంపీడీవో బి.రాంప్రసాద్, ఎంపీటీసీ పిల్లి తిరుమలరావు, తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కొవ్వూరు: ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. స్థానిక గౌతమీనగర్-2 సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. 11, 12 వార్డులకు సంబంధించిన లబ్ధిదారులకు 523 ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు కమిషనర్ బి.శ్రీకాంత్ తెలిపారు. కౌన్సిలర్లు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, తోట లక్ష్మీప్రసన్న, అంకోలు వెంకటలిల్లీ పద్మలీల, పట్టణ పార్టీ గౌరవ అధ్యక్షుడు నగ్గలపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. నందమూరు జరిగిన జగనన్న సురక్షలో ఎంపీడీఓ కె.సుశీల, ఈవోపీఆర్‌డీ శర్మ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ పి.రామకృష్ణ, సర్పంచ్ కంటిపూడి గంగాభవానీ పాల్గొన్నారు. వివిధ రకాల 565 ధ్రువీపత్రాలు పంపిణీ చేశారు



కొవ్వూరులో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి

ఉండ్రాజవరం: వెలగదుర్రు గ్రామంలో తహసీల్దార్ జి.కనకరాజు, సత్యవాడలో ఎంపీడీఓ గాదిరాజు రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష సభలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నిడదవోలు నియోజకవర్గ పరిశీలకుడు చిర్ల రాధయ్య, మండల జేసీఎస్ కన్వీనర్ కఠారి సిద్ధార్థరాజు మాట్లాడారు. అనంతరం ప్రజలకు ధ్రువపత్రాలు అందజేశారు. ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, సర్పంచులు సాగి పద్మావతి, ఇందుకూరి దేవిభార్గవి పాల్గొన్నారు.

నూరు శాతం లబ్ధి పొందాలి

పెరవలి: అర్హులు నూటికి నూరు శాతం పథకాల లబ్ధి పొందాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమాల్లో భాగంగా కాకరపర్రులో 515, పెరవలిలో 125 వివిధ ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో ఏ పథకం కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాలు, జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పరిపాలనే ప్రజల ముందుకు తీసుకు వచ్చామన్నారు. తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి, ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, సర్పంచ్ గుబ్బల ఆదిలక్ష్మి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: అర్హులందరికీ న్యాయం చేయడమే ధ్యేయంగా జగనన్న సురక్ష కార్యక్రమం చేపడుతున్నామని ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు అన్నారు. స్థానిక 13, 14, 16 వార్డులకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సాంకేతిక కారణాలతో పథకాలు పొందలేని అర్హులకు జగనన్న సురక్ష ద్వారా సమస్యలు పరిష్కరించవచ్చన్నారు. వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబుతో పాటు తన దత్తపుత్రుడు చేసిన అనుచిత వ్యాఖ్యలపై ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. అనంతరం 1200 మందికి కుల, 1,100 మందికి ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందించారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కేవీ పద్మావతి, జేసీఎస్ కన్వీనర్ ఎస్‌కే ఖాన్‌బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

కష్టకాలంలో అండగా..



ముక్కామలలో పంట చేలో ఉన్న మహిళకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ గెద్దం కిరణ్‌బాబు

కరోనా లాక్‌డౌన్ సమయంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అప్పుడు పెరవలి మండలం ముక్కామల గ్రామ సచివాలయ పరిధిలో వలంటీర్ గెద్దం కిరణ్‌బాబు ప్రభుత్వ పథకాలు అందించటంతో పాటు తన పరిధిలోని 28 పేద కుటుంబాలకు సాయం చేశాడు. తన సొంత సొమ్ముతో నిత్యావసర సరుకులతో పాటు బియ్యం అందించాడు. లాక్‌డౌన్‌లో ఒక దివ్యాంగురాలు విశాఖపట్నంలో చిక్కుకుపోతే అక్కడకు వెళ్లి పింఛన్ ఇచ్చాడు. ఇతని సేవలకు నాలుగేళ్లుగా ప్రభుత్వం సేవా వజ్ర, సేవా మిత్ర వంటి అవార్డులను అందించింది. ప్రతి నెలా 1వ తేదీ వచ్చిందంటే ఆ రోజు సాయంత్రానికే ఎవరు ఎక్కడున్నా పింఛన్ అందించడం బాధ్యతగా తీసుకుంటున్నాడు. ఇతని సేవలకు అంతా సలాం కొడుతున్నారు. -పెరవలి

తలుపుతట్టిన పథకాలు



కొన్నేళ్ల కిందట ఇంటి స్థలం కోసం అధికారులు, నాయకుల చుట్టూ తిరిగినా మంజూరు కాలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థ వచ్చాక ప్రభుత్వం అందించే అన్ని సంక్షేమ పథకాలు మా ఇంటి తలుపుతట్టాయి. ప్రభుత్వ స్థలం ఇవ్వడంతో పాటు సొంత ఇంటిని నిర్మించుకున్నాం. పిల్లలకు అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, విద్యా కానుక వంటి సంక్షేమ పథకాలు దరిచేరాయి. ఇవి అన్నీ అందుకున్నామంటే వలంటీర్ చలువే.

-గెద్దం జ్యోతి, లబ్ధిదారు, ముక్కామల

పలకరిస్తూ.. సేవచేస్తూ..



మల్లేశ్వరంలో పింఛన్ సొమ్మును అందిస్తున్న వలంటీర్ నేదునూరి మహావిష్ణు

సేవలకు ప్రతిరూపం వలంటీర్లు. ఎవరైనా అనారోగ్యంగా ఉన్నారంటే చాలు తానే స్వయంగా ఆసుపత్రికి తీసుకువెళ్లి పెరవలి మండలం మల్లేశ్వరం గ్రామ వలంటీర్ నేదునూరి మహావిష్ణు సేవలందిస్తున్నారు. 2021 కరోనా సమయంలో ఏప్రిల్ నెలలో ప్రభుత్వ పింఛన్ సొమ్ము ఒకరోజు ఆలస్యమైతే తన సొంత సొమ్ము రూ.76,500 ఒకటో తేదీనే లబ్ధిదారులకు అందించాడు. కరోనా సమయంలో ప్రజలకు అతను విశేష సేవలందించాడు. ఇక ప్రభుత్వ పథకాలు అందించడంలో తనకు తానే పోటీ అన్నట్లు లబ్ధిదారులకు అందే వరకూ కృషి చేస్తున్నాడు.

వలంటీర్ వల్లే బతికా..



నేను బతికి ఉన్నానంటే మా వలంటీర్ చలువే. కరోనా సోకి ఇంట్లో ఇబ్బంది పడుతుంటే తానే స్వయంగా వచ్చి ఆసుపత్రికి తీసుకెళ్లాడు. వైఎస్సార్ ఆసరా పథకంలో వేలిముద్ర వేయించడానికి కరోనా పేషెంట్లు ఉన్న రూమ్‌లోకి ప్రాణాలకు తెగించి వచ్చి వేలిముద్ర వేయించాడు. దీనివల్ల నాకు ప్రభుత్వం నుంచి రూ.18,500 వచ్చింది. మా వలంటీర్ లేకపోతే నా ప్రాణాలు పోయేవి.

-లక్కోజు గంగారత్నం, మల్లేశ్వరం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



తాడిపర్రులో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

ఉండ్రాజవరం: ప్రజా సంక్షేమమే సీఎం జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. గురువారం తాడిపర్రు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని చెప్పారు. పార్టీలకు అతీతంగా అర్హులకు పథకాలు మంజూరవుతున్నాయని తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు అక్కిన రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కరుటూరి వెంకటేశ్వరరావు, మారిశెట్టి నరసింహమూర్తి, పి.భీమరాజు, కోమటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సమస్యల పరిష్కారానికి కృషి

సీటీఆర్ఐ: ముస్లింల సమస్యలు తెలుసుకుని, వాటిపై ప్రభుత్వానికి నివేదిక అందజేసి, త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తున్నామని వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మహ్మద్ ఆరిఫ్ అన్నారు. ఆయన గురువారం స్థానికంగా పలు మసీదులను సందర్శించి ఇమామ్, మౌజాన్‌లకు గౌరవ వేతనాలు అందుతున్న తీరును పరిశీలించారు. షాదీఖానాలు, ఖబరిస్థాన్ ప్రహరీలు, ధార్మిక కేంద్రాల మరమ్మతులకు సంబంధించి ఎంతో కాలంగా ఉన్న డిమాండ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ఇప్పటికే ఉర్దూను ప్రభుత్వం రెండో అధికారిక భాషగా గుర్తించిందన్నారు. కేవలం ధార్మికపరమైనవే కాక ప్రభుత్వ అందజేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించి ఏమైనా లోటుపాట్లు ఉన్నా, అర్హత ఉండి పథకాలను అందుకోలేకపోతున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని పరిష్కరించేందుకు అధికారులతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ అందజేస్తున్న పథకాల ద్వారా ముస్లిం సమాజం ఎంతో లాభపడుతోందన్నారు. వాటిని ఉపయోగించుకుని విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



గీత

చాగల్లు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎస్.గీత అండర్ -15 విభాగంలో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పి.వీర్రాజు తెలిపారు. ఈ నెల 9న క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఏలూరులో నిర్వహించిన బాలికల క్రికెట్ ఎంపికల్లో గీత పాల్గొని సత్తా చాటిందన్నారు. త్వరలోనే రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొంటుందని వివరించారు. గీతను, ఆమె శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు జె.విజయలక్ష్మిని పలువురు అభినందించారు.

సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

పెరవలి: వైఎస్సార్ సీపీ నాయకుడు, కడిపాండు సర్పంచ్ దేవరపు శ్రీహరి తండ్రి నాగేశ్వరరావు (65) గురువారం మృతి చెందారు. శ్రీహరిని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు పరామర్శించారు. ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, పలు గ్రామాల సర్పంచులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం

గోపాలపురం: మండల మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మానవత గౌరవాధ్యక్షుడు జొన్నలగడ్డ రాంబాబు అన్నారు. నూతన అధ్యక్షుడు ముప్పన కృపావరప్రసాద్‌రెడ్డి సారథ్యంలో మండల మానవత సంస్థ సభ్యత్వాల నమోదు వేగవంతంగా జరుగుతుందన్నారు. కార్యవర్గ సభ్యులు ముప్పిడి అనుదీప్‌రెడ్డి, గెడా జోగేంద్రప్రసాద్, పప్పు సత్యకృష్ణారెడ్డి, కుక్కల కీర్తికుమార్, రాపాక ఫణికిశోర్ తదితరులు పాల్గొన్నారు.

వేతన సవరణ సంఘ నియామకం హర్షణీయం



పాడిపిరెడ్డి రవిశంకర్

కొవ్వూరు: రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ కొవ్వూరు తాలుకా యూనిట్ అధ్యక్షుడు పాడిపిరెడ్డి రవిశంకర్ తెలిపారు. ఉద్యోగులు రోడ్డెక్కి ఉద్యమాలు చేస్తే తప్ప గత ప్రభుత్వాలు వేతన సవరణ సంఘం నియమించిన దాఖలాలు లేవన్నారు. ఉద్యోగులు అడగకుండా ఐదేళ్లకు ఒకసారి చేసే వేతన సవరణ కమిషన్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించడం సంతోషదాయకమన్నారు. ఉద్యోగుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఈ కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. దీనిద్వారా ఆరు నెలల్లో రిపోర్టు సేకరించి మధ్యంతర భృతిని చెల్లించాలని కోరుకుంటున్నామన్నారు. సీఎం జగన్, ఇతర మంత్రులకు తమ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.

నల్లజర్లలో మెగా వైద్యశిబిరం



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

నల్లజర్ల: స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం తాడేపల్లిగూడెం యూనియన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని సర్పంచ్ పల్లి జ్యోతి ప్రారంభించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 200 మంది రోగులకు గుండె సంబంధిత వ్యాధులకు, నరాలు, ఎముకలు, స్త్రీలకు సంబంధించిన వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ కల్యాణ చక్రవర్తి, డాక్టర్లు జయకృష్ణ, రత్నమాల, ఎస్.రజితకుమారి వైద్య పరీక్షలు చేశారు. సొసైటీ అధ్యక్షులు కారుమంచి రమేష్, మద్దిపాటి ప్రసాద్, పల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల సత్తా

ప్రకాశం నగర్: జాతీయ స్థాయి కరాటే, కుంగ్‌ఫూ ఓపెన్ చాంపియన్ షిప్ 2023 పోటీలు గురువారం స్థానిక మల్లయ్యపేట రిక్రియేషన్ క్లబ్‌లో ఉత్సాహంగా జరిగాయి. బ్లాక్ బెల్ట్ విభాగంలో ఎస్.శ్రీలక్ష్మి మొదటి, లక్ష్మీ సంధ్య రెండు, భవాని మూడోస్థానంలో నిలిచారు. అండర్ 8, 10, 12 విభాగాల్లో జయదీప్, కీర్తన, హర్షల్ బంగారు పతకాలు, అభిషేక్, అయేషా వెండి పతకాలు సాధించారు. విజేతలను కరాటే మాస్టర్లు పిల్లి అరుణ్ కుమార్, విజయ్, బూడిద సాయి, సుమన్ అభినందించారు.

గంజాయి స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట ఆవ రోడ్ లారీస్టాండ్ సమీపంలో ఒడిశాకు చెందిన లారీలో 2.15 కిలోల గంజాయిని బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై జగన్‌మోహన్‌రావు స్వాధీనం చేసుకున్నారు. బిహార్ చెందిన లారీడ్రైవర్ శుభాష్‌షాను అరెస్టు చేశారు. విశాఖ నుంచి వచ్చే దారిలో గంజాయిని కొనుగోలు చేసినట్లు తెలిసిందని, తమకు అందిన సమాచారం మేరకు లారీని సోదా చేయగా గంజాయి దొరికిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జగన్‌మోహన్‌రావు తెలిపారు.